క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



పాంగి లక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొమ్మంగి సర్పంచ్ పాంగి లక్ష్మిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆదివారం విశాఖపట్నం కేజీహెచ్ ఆస్పత్రిలో పరామర్శించారు. లక్ష్మికి మేరుగైన సేవలు అందించి త్వరగా కోలుకోనేలా చూడాలని వైద్యులను కోరారు.

గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కొయ్యూరు: మండల అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, ప్రధాన కార్యదర్శి సింహాచలం ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షుడిగా నర్సి పాపారావు, ప్రధాన కార్యదర్శిగా మునేజు అప్పలకొండతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు పలువురు మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

భారీ అన్నసమారాధన



మోదకొండమ్మతల్లి ఆలయంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. అనేక ప్రాంతాల నుంచి భక్తులు వేకువజాము నుంచే మోదకొండమ్మతల్లి దర్శనానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వేమూరి వెంకటరంగారావు ఆర్థిక సాయంతో భక్తులకు భారీ అన్న సమరాదన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జేఏసీ మండల నూతన కార్యవర్గం

కొయ్యూరు: ఆదివాసీ జేఏసీ మండల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. కమిటీ కన్వీనర్‌గా బూదరాళ్ల వార్డు సభ్యుడు సాగిన సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా ఉల్లి సూరి బాబు, గౌరవ అధ్యక్షుడిగా శ్రీరాములు, కో- కన్వీనర్లుగా మహేష్, రమణ, మహిళా కార్యదర్శులుగా కుమారి, భూలక్ష్మి, ప్రచార కార్యదర్శులుగా చిన్నారావు, శ్రీనుబాబు, కోశాధికారి గా వెంకట్రావును ఎన్నుకున్నారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎం.రాజుబాబు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.గంగరాజు, జిల్లా కన్వీనర్ రామారావుదొర, రాష్ట్ర ఆదివాసీ జేఏసీ మహిళా కమిటీ సభ్యులు శ్యామల వరలక్ష్మి, నాయకులు బూర్గులయ్యా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎమ్మెల్యే పర్యటన



ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: మండలంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు పర్యటించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య చెప్పారు. మండంలో ని మర్రివాడ, బూదరాళ్ల పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొ న్నారు. ఇందులో భాగంగా 29, 30తేదీల్లో మర్రివాడ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో, 31న బూదరాళ్ల సచివాలయ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించనున్నట్టు తెలిపారు. అన్ని శాఖ ల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పూర్తి వివరాలతో కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు నిమిత్తం కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

అనంతగిరి: మండలంలోని ఎస్.ఆర్.పురం, రోంపల్లి పంచాయతీల పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు సింహాచలం, అప్పలరాజు, పెంటయ్య తదితరులు కోరుతున్నారు. ఈ మేరకు వారు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు.కొన్ని ప్రాంతాల్లో సక్రమంగా విద్యుత్ సదుపాయం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

మన్యంలో లాభాల సాగు



దుంబ్రిగుడలో చిలగడ దుంపల పంట



క్యారెట్ దిగుబడులు



చింతపల్లిలో సాగులో ఉన్న మిరపపంట

- విస్తారంగా చిలగడ దుంపల పంట
- పెరుగుతున్న క్యారెట్ సాగు విస్తీర్ణం
- మిరపకు డిమాండ్

దంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో పాటు వాణిజ్య పంటల సాగు విస్తారంగా పండిస్తున్నారు. ఏజెన్సీలో పండించే పంటలకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఉంది. ఇక్కడ పండించే కాఫీ, పసుపు, మిరియాలు తదితర పంటలు దేశంలో వివిధ ప్రాంతాల్లో రవాణా జరుగుతోంది. మార్కెట్ బాగుండడంతో గిరిజన రైతులు ఏటా సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో క్యారెట్, క్యాబేజీ, వంగతో పాటు చిలగడ దుంపలు, మిరప సాగు విస్తారంగా పండిస్తున్నారు.

మంచి ధరలతో లాభాలు

మండలంలోని 18 పంచాయయతీల్లో కూడా గిరిజన రైతులు ఈ ఏడాదిలో చిలగడ దుంపల పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. మండలంలోని సొవ్వ, గసభ, కొర్రాయి, కోల్లాపుట్టు ,గుంటసీమ ,అరమ తదితర పంచాయతీల్లో చిలగడ దుంపల పంటలను విస్తారంగా పండిస్తున్నారు. మండల వ్యాప్తంగా గత ఏడాదిలో 120 ఎకరాల్లో పండిస్తే ఈ ఏడాదిలో మాత్రం 235 ఎకరాల్లో పంటలను విస్తరించినట్టు అధికారులు అంటున్నారు. గత ఏడాదిలో 50 కిలోల బస్తా రూ.700 నుంచి రూ.900 వరకు ధర పలుకుతోంది. ఆయా ప్రాంతాల్లోని సంతలకు మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి చిలగడ దుంపలను కొనుగోలు చేస్తున్నారు. ధరలు బాగున్నాయని మరింత పెరిగే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా క్యారెట్ దిగుబడి

చింతపల్లిరూరల్: మండంలో సుమారు గత ఏడాది ఈ-క్రాప్ బట్టి 232 ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇందులో క్యారెట్ సుమారు 45 ఏకరాల్లో పండిస్తున్నారు. మండలంలోని చౌడుపల్లి, లోతుగెడ్డ, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో క్యారెట్ ఎక్కువగా పండిస్తున్నారు. వాతావరణం, నేలా అనుకూలించడం వలన దిగుబడి మంచిగా ఉందని రైతులు చెబుతున్నారు.మార్కెట్‌లో కుడా మంచి ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు సంతలకు వచ్చి కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. సుమారు కిలో రూ.40 నుంచి రూ.50 ల మధ్య విక్రయిస్తున్నారు.

మిరపలో హైబ్రిడ్ రకాలు మేలు

చింతపల్లి: గిరిజన రైతులు హైబ్రిడ్ మిరప రకాలు సాగుచేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వివిధ రకాల కూరగాయలతో పాటు మిరపను కూడా సాగు చేస్తున్న రైతులు అధిక దిగుబడులు ఇచ్చే హైబ్రిడ్ రకాలు ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా దాదాపు 300 ఎకరాల్లో మిరపను వాణిజ్యపరంగా సాగుచేస్తున్నారని శాస్త్రవేత్త శివకుమార్ తెలిపారు. అన్‌మోల్, బి.ఎస్.ఎస్-273 రకాలు మంచి దిగుబడులు ఇస్తున్నట్టు పరిశోధనలో వెల్లడైనట్టు ఆయన తెలిపారు. గతంలో భాస్కర్, సింధూర, కిరణ్, భాగ్యలక్ష్మి వంటి రకాలను గిరిజనులు సాగుచేశారని తెలిపారు. మిరప పంటలో చీడపురుగుల నియంత్రణకు మొక్కజొన్న పంటగా వేస్తారు.

రహదారి పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య, నేతలు

చింతపల్లి రూరల్: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు.మండంలో బలపం పంచాయతీ కోరుకొండ నుంచి బురుగుబయలు వరకు నిర్మించ తలపెట్టిన రహదారి నిర్మాణ పనులకు వారు ఆదివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిర్మిస్తున్న ఈ రహదారి నిర్మాణానికి రూ.4కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్ పనుల నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపించరన్నారు. వారికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. గత టీడీపీ హయాంలో ఏజెన్సీలో కనీస అభివృద్ధి పనులు జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత శివారు గ్రామాల్లో సైతం రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. అన్ని ప్రాంతాలకు రవాణా సదుపాయం కలగడం ఆనందంగా ఉందన్నారు. బలపం సర్పంచ్ కోర్ర రమేష్ నాయుడు, సీఐ రమేష్, అన్నవరం ఎస్ఐ రమణ. ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

సీలేరు: స్థానిక జెన్‌కో కాంట్రాక్టు కార్మికుల ప్రాంతీయ సమావేశం శనివారం జరిగింది. సీఐటీయూ ఆధ్వర్యంలో విష్ణువర్ధన్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో కార్మికులకు తీరని నష్టం జరుగుతోందన్నారు. ఉద్యోగులు క్రమబద్ధీకరణ జరగక నష్టపోతున్నారన్నారు. కార్మిక వర్గం పోరాటాలు చేస్తున్నా సర్కారు నిర్లక్ష్యంగా ఉంటోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కార్మికులంతా చట్టాలను పరిరక్షించుకోవాలన్నారు. సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రమణ, యూనియన్ నేతలు సుభాన్, వరహాలు, లక్ష్మణ్, సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ టూరిజం కార్మిక సంఘం నూతన కార్యవర్గం

అనంతగిరి: మండల కేంద్రంలోని ఆదివారం పర్యాటకశాఖ కార్మికులు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. మర్రి కామయ్య ఆదివాసీ టూరిజం కార్మిక యూనియన్ పేరుతో యూనియన్ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా జాన్, ప్రధాన కార్యదర్శులు రామరాజు, వరప్రసాద్, నాగేశ్వరరావు, త్రినాథరావు, బలరామ్, జనరల్ సెక్రటరీలు నాగేశ్వరరావు, గుండు, మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, అర్జున్ తదితరులతో కూడిన నూతన కార్యవర్గం ఎనుకున్నారు.

నిర్లక్ష్యం తగునా!



దిగువపేదాపల్లి గ్రామంలో బైక్ కవర్‌గా వినియోగిస్తున్న దోమతెర

పెదబయలు: ప్రజలు దోమల నుంచి రక్షణ పొందేందుకుగాను ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి నాణ్యతతో కూడిన దోమ తెరలు ఉచితంగా పంపిణీ చేసింది. అయితే కొంతమంది దోమతెరలని సక్రమంగా వినియోగించుకుంటున్నారు. మరికొంత మంది దోమ తెరులు వారికి ఇష్టం వచ్చిన రీతిలో వినియోగిస్తున్నారు. మొక్కలకు రక్షణగా, నీళ్ల కుండీలపై కవర్లుగా వినియోగిస్తున్నారు. పెదబయలు మండలం వనభంగి పంచాయతీ దిగువ పేడాపల్లి గ్రామంలో రోడ్డుకు ఆనుకుని ఒకరు తన బైక్‌పై కవర్‌గా దోమ తెరను వినియోగించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అందజేసిన దోమతెరలను ఇలా దుర్వినియోగం చేయడం తగదని పలువురు చెబుతున్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



జి.భూదేవి (ఫైల్)

చింతపల్లి రూరల్: మండంలంలో చిట్రాలగొప్పు అంగన్‌వాడీ కార్యకర్త గెమ్మిలి భూదేవి(45) గుండెపోటుతో మృతి చెందారు. చిట్రాలగొప్పు అంగన్‌వాడీ కార్యాలయంలో విధులు ముగించుకొని ఇంటి వచ్చిన తరువాత సాయంత్రం ఆమెకు గుండెపోటు రావడంతో ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. వైద్యులు చికిత్స ప్రారంభించారు.అర్ధరాత్రి తరువాత ఆమెకి వాంతులు కాగా, కొన్ని నిమిషాల వ్యవధిలో ఆమె తుది శ్వాస విడిచినట్టు చెప్పారు. ఆమె మృతదేహానికి ఆదివారం స్వగ్రామం చిట్రాలగొప్పులో అంతక్రియలు నిర్వర్తించారు. ఆమె మృతిపై సీడీఎస్ సీడీపీవో రమణి, రామలక్ష్మి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

వెల్లువెత్తిన అభినందనలు



కరక లక్ష్మిని అభినందిస్తున్న పార్టీ శ్రేణులు



జోలాపుట్టులో జగబంధు దంపతులను సన్మానిస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలు

ముంచంగిపుట్టు: జోలాపుట్టులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అరబీరు జగబంధును సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. జీవితాంతం తాను, తన కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి దొహదపడిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు నీలకంఠం, గంగాధర్, నరసింగరావు, బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు కమల, నాయకులు మూర్తి, కొండలరావు, రామ్మూర్తి, అర్జున్, సోలెమాన్, మణి, రాంప్రసాద్, భాగత్‌రాం, తిరుపతి, దాసు, సన్యాసిరావు, పిత్‌టాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కరక లక్ష్మిని అభినందించిన నేతలు

కూనవరం: వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎంపీపీ కరక లక్ష్మిని జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించడంపై పార్టీ శ్రేణులు ఆమెకు అభినందనలు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మండల జేఎస్‌సీ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మేరుకులం, ఆరెకటిక కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు దీకొండ గంగాధర్‌రావు, అరవా వెంకట రామారావు, సచివాలయం కన్వీనర్లు ఎలిపె రమేష్, మేడిద నాగేంద్ర తదితరులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. మరియాదాస్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసున్న కరక లక్ష్మికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారన్నారు. అనంతరం కరకలక్ష్మి మాట్లాడుతూ తనకు ఈ పదవి దక్కినందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి, అందుకు దోహదపడిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

తీరనున్న కష్టాలు



ఆకుమామిడికోట వద్ద కొత్త వంతెన పనులు



ఆకుమామిడికోట వద్ద బెయిలీ బ్రిడ్జి

రంపచోడవరం: ఏజెన్సీలో కొండకాలువలు గిరిజనుల రవాణాకు పెద్ద సమస్యగా ఉంది. వర్షకాలంలో కొండవాగులు పొంగి ప్రవాహిస్తే బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్లే. ఏజెన్సీలో అనేక చోట్ల గిరిజనుల ఇక్కట్లు తొలగించేందుకు బ్రిడ్జి నిర్మాణాలు చేపడుతున్నారు.మారేడుమిల్లి-గుర్తేడు రహదారిలో సంగువ వాగుపై ఉండే చప్టా కొట్టుకుపోవడంతో దశాబ్దకాలం క్రితమే గిరిజనులు రాకపోకలు సాగించేందుకు బెయిలీ బ్రిడ్జి నిర్మించారు. ఈ వంతెన ఇరుకుగా ఉండడంతో స్థానికులు బ్రిడ్జి కోసం గత టీడీపీ హయాంలో పాలకులను విన్నవించినా పట్టించుకోలేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలంలోని లోతట్టు ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు, మండల కేంద్రాలకు రహదారి సౌకర్యాన్ని మెరుగుపరిచారు. ఇందులో భాగంగా ఆకుమామిడికోట వద్ద కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.వంతెన నిర్మాణం పూర్తయ్యే దశకు చేరుకుంటుంది.

మారుమూల గ్రామాలకు రహదారి



ఏజెన్సీలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక లోతట్టు ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించింది. ఆకుమామిడి కోట వంతెన నిర్మాణం పూర్తయితే అనేక గ్రామాల గిరిజనులకు రవాణాలో ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం ఉన్న బెయిలీ బ్రిడ్జిపై రెండు వాహనాలు ఒకేసారి వెళ్లే పరిస్థితి లేదు. ఒక వాహనం వెళ్లిన తరువాత మరో వాహనం వెళ్లాలి. ప్రస్తుతం ఆకుమామిడికోట వద్ద వంతెన పనులు జోరందుకున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఉండవు.

– దూడ స్మిత్, మారేడుమిల్లి

31న మండల సమావేశం

కూనవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటల కు ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఈ.ప్రేమ్‌సాగర్ ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ గుజ్జా విజయతో పాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబధించిన ప్రగతి నివేదికలను రెండురోజులు ముందుగా కార్యాలయానికి అందజేయాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ రాజారావు

కొయ్యూరు: మండలం కేంద్రంలోని వారపు సంత వద్ద ఎస్ఐ రాజారావు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదా ల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. 95 శాతం రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణమవుతున్నాయన్నారు. వాహనాల అతి వేగం డ్రైవింగ్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముందు వెళ్తున్న వాహనాలను తప్పించే సమయంలో ఎదురుగా వస్తున్న వాహణాలను ఢీకొట్టి ప్రమాదాన్ని తెచ్చుకుంటున్నారన్నారు. ప్రమాదాల కారణంగా వారిపై ఆధారపడినవారు వీధిన పడుతున్నారన్నా రు. మైనర్లు వాహనాలు డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహన రికార్డులను తమ వెంట ఉంచుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



పూజల్లో పాల్గొన్న విద్యార్థులు, మహిళలు

మాకవరపాలెం: సరస్వతీదేవికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ఏకాదశి సందర్భంగా ఆదివారం స్థానిక రామాలయంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ ల్లో గ్రామానికి చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు సైతం పాల్గొని సరస్వతీ దేవికి విశేష పూజలు చేశారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



హెచ్‌ఎంను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ: తురువోలు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు 200 కంచాలతోపాటు కంప్యూటర్ టేబుల్‌ను వితరణగా అందించారు. ఇక్కడ 2002–03లో పదో తరగతి చదివిన వీరంతా ఆపై ఉన్నత చదువులు పూర్తి చేసుకుని వివిధ స్థాయిల్లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు తమవంతు సహకారంగా సొంత నిధులతో వీటిని సమకూర్చారు. అనంతరం హెచ్‌ఎం రామకృష్ణను దశ్శాలువాతో సత్కరించారు. పాఠశాలకు ఏ అవసరమున్నా తమవంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల రూరల్: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సృజనవాణి సంస్థ సమన్వయకర్త కె.జానీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, డిప్లొమా, నర్సింగ్, బీఈడీ, డీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న వారికి స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. దీనికోసం హెచ్‌టీటీపీఎస్.స్కాలర్‌షిప్‌స్రుజనవాణి.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 7989947349, 9618074436 సంప్రదించా లని కోరారు.